# ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**



హైదరాబాద్, బతుకమ్మ : న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి సంపూర్ణ మద్దతు ఇస్తుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పై మంగళవారం శాసన సభలో జరిగిన చర్చ సందర్భంగా మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 14 ప్రకారం ఆయా రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లును సమర్థిస్తున్నామని అన్నారు. మాదిగల సామాజిక ఆర్థిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా కేసీఆర్ వర్గీకరణ అంశానికి మొదటి నుండి సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. టీఆర్ఎస్ పార్టీ ఉద్యమం నుండి పుట్టిన పార్టీ కాబట్టి స్వయంగా కేసీఆర్ ఒక అస్తిత్వ ఉద్యమ నాయకుడిగా వర్గీకరణ అంశంలో మందకృష్ణ మాదిగ తో పాటు అనేక ఇతర సంఘాలు,సంస్థలు, వ్యక్తులు,మేధావులు చేసిన పోరాటాన్ని,ఉద్యమాన్ని అర్థం చేసుకొని వారి కార్యాచరణకు ఎల్లప్పుడూ అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. మాదిగలను కేవలం ఓటు బ్యాంకు గా చూసే కొన్ని రాజకీయ పార్టీల అవకాశ వాదానికి భిన్నంగా బీఆర్ఎస్ పార్టీ , కేసీఆర్ అధికారం లో ఉన్నా లేకున్నా ఉద్యమం నుండి ఈ రోజు దాకా సుమారు 25 సంలుగా ఈ ఎస్సీ వర్గీకరణ అంశంలో ఒకే స్టాండ్ తీసుకొని మద్దతు అందించారు, అందిస్తూనే ఉన్నామన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి బీఆర్ఎస్ అధికారంలో వచ్చిన వెంటనే 29 నవంబర్ 2014 లోనే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేసీఆర్ కేంద్రానికి పంపించారని తెలిపారు. అంతేకాకుండా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ని స్వయంగా కలిసి తీర్మానం కాపీలను అందజేసి రాజ్యాంగ సవరణ చేయాలని కోరారని తెలిపారు. ఆ తర్వాత మోడీ ప్రభుత్వ నాన్చివేత ధోరణి ని నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ అంశంలో వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలంటూ బీఆర్ఎస్ ఎంపీ లు అనేక సార్లు పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు కు ఎస్సీ వర్గీకరణ అంశం చేరితే సుప్రీం కోర్టులో ఉన్న వర్గీకరణ కేసులో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇంప్లీడ్ అయి అనుకూల వాదనలు వినిపించామన్నారు. చివరకు ఆగస్టు 1 ,2024 న సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రాలకుంది అని తీర్పు ఇస్తే ఆ తీర్పును బీఆర్ఎస్ పార్టీ వెంటనే స్వాగతించింది, సమర్థించిందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం చేసే అన్ని సానుకూల నిర్ణయాలకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. 10 సంవత్సరాల పాటు బీజేపీ నాన్చివేత ధోరణి తో లక్షలాది మంది మాదిగ బిడ్డలకు దక్కాల్సిన విద్య,ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ఉద్యోగాల్లో కొత్త రిజర్వేషన్ ప్రకారం అవకాశాలు ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పారని, ఇప్పుడేమో పాత రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటి నుండి రాబోయే అన్ని విద్యా,ఉద్యోగాల్లో కొత్త రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నది అన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి అయితే స్థానిక సంస్థల్లో మాదిగలకు రాజకీయ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని అన్నారు.

# సన్మానాలకు అలవాటు పడుతున్న అధికారులు

**గొర్రె దాటుడు పద్ధతిగా మారుతున్న సన్మానాలు**

బతుకమ్మ, నాగిరెడ్డి పేట : ప్రజా ప్రతినిధులు ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరుతూ, అలాగే వారు ప్రజలకు అందించిన ఉత్తమ సేవలను గుర్తిస్తూ కృతజ్ఞత భావంతో వారిని ప్రజలు కానీ, నాయకులు కానీ శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించడం సాంప్రదాయం. కానీ ప్రస్తుతం ఈ సన్మానాల పద్ధతి కాస్త దారి తప్పి గొర్రె దాటుడు పద్ధతిలో ప్రజా ప్రతినిధుల నుండి అధికారుల వరకు పాకిపోయింది. ప్రస్తుతం కొంతమంది అధికారులు నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఇలా ప్రతి ఒక్కరు ప్రభుత్వ అధికారులను శాలువాలు కప్పి సన్మానిస్తున్నారు. ప్రజలకు అధికారికంగా సేవలందించాల్సిన అధికారులు కూడా తమకు సన్మానాలు చేస్తుంటే చాలా



గొప్పగా అనుభూతిని పొందుతూ తనకేమీ తెలియనట్లుగా రాజకీయ నాయకులతో శాలువాలు కప్పించుకుని సన్మానాలు చేయించుకుని తమకేమీ తెలియనట్లుగా పత్రికలకు టీవీలకు ఫోజులు ఇస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా పోలీసు వ్యవస్థలో కూడా ఈ సన్మానాల కార్యక్రమం ఈ మధ్యన కొత్త ట్రెండును సంతరించుకుంది. పోలీస్ బాసు లు నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సన్మానాలే, ఒక చోట నుండి మరోచోటికి బదిలీ అయినా సన్మానాలే జరుగుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులను రాజకీయ నాయకులు సన్మానించడం ఒక ఎత్తు అయితే, సమాజంలో జరుగుతున్న అవినీతిని వెలికి తీయాల్సిన జర్నలిస్టులు కూడా అధికారులను సన్మానించడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులలో ముఖ్యంగా ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇలా పెద్ద స్థాయి వారికి సన్మానం చేయడం ఒక సమంజసమైన పద్ధతి. కానీ ప్రస్తుతం నడుస్తున్న కాలంలో కొంతమంది ప్రజా ప్రతినిధులు, చోటా మోటా నాయకులు, కార్యకర్తలు తమ తమ పలుకుబడిని చాటుకునే ఉద్దేశంతో, తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికారికంగా సేవలందించాల్సిన ప్రభుత్వ అధికారులకు కూడా ఘనంగా సన్మానాలు చేయడం ఎంతవరకు సమంజసమో, వారు సన్మానాలు చేయించుకోవడం కూడా ఎంతవరకు సమంజసమో ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మిషన్ భగీరథ నీరు

**కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి, బతుకమ్మ : ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో మిషన్ భగీరథ, మెడికల్ కళాశాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు శాశ్వత ప్రాతిపదికన మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కళాశాలకు అవసరమైన నీటి సరఫరాకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ఈ వేసవి కాలంలో ప్రస్తుతం అద్దెలో నడుస్తున్న హాస్టల్ లలో నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని మున్సిపల్ కమీషనర్ కు సూచించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ రాజేంద్ర కుమార్, డిప్యూటీ ఈఈ నవీన్, మెడికల్ కళాశాల



ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శివ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్రకాష్ లు పాల్గొన్నారు.

## చేపల వలలో చిక్కుకొని ఒకరి మృతి



భీమ్‌గల్, బతుకమ్మ : ప్రతి రోజు చేపలు పట్టి అమ్ముకొని జీవనం కొనసా గించే తోపారం బొర్రన్న(49) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చేపల వలలో చిక్కుకొని నీటమునిగి మృతి చెందాడు. మృతుని కుటుంబీకురాలు ఎల్లల సిద్దపల్లి లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సిద్దపల్లి గ్రామంలో నివసిస్తున్న తోపారం బొర్రన్నకు పెండ్లి కానందున ఒంటరిగా జీవిస్తున్నాడు. ప్రతి రోజు చేపలు పట్టుకొని జీవనం కొనసాగిస్తున్న ఆయన రోజు మాదిరిగా మంగళవారం చెరువులోకి చేపలు పట్టడానికి పందిరి నగేష్, తోపారం గంగాధర్ తో కలిసి వెళ్లాడు. చేపలు పడుతుండగా చేపల వలలో చిక్కుకొని నీటిలో మునిగి మృతి చెందాడు. కుటుంబీకురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

## ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్, ఆర్మూర్ పట్టణ పరిధిలో మంగళవారం ఫుట్ పాత్ ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఉత్తర్వుల ప్రకారం నిజామాబాదు ట్రాఫిక్ ఏసిపి ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు దుకాణాల ముందు ఉన్న ఫుట్ పాత్ దుకాణాలను తొలగించారు. ఈ ఆక్రమణలను ట్రాఫిక్ ఏసిపి, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి తొలగించి ట్రాఫిక్ కు అంతరాయాలు కలగకుండా చేశారు. అంతేకాకుండా ఆర్మూర్ బస్టాండ్ ముందర కూడా అక్రమంగా ఆక్రమించిన ఫుట్‌పాత్‌లను తొలగించారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్



ఎడపల్లి, బతుకమ్మ : ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్ పెక్టర్ అంజయ్య తెలిపారు. ఎడపల్లిలోని పాడుబడ్డ రైస్ మిల్ లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, స్పెషల్ పార్టీ దాడి చేసిందని తెలిపారు. ఈ దాడిలో ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి ఆరు సెల్ ఫోన్లు, రూ.1570నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని తదుపరి చర్యల నిమిత్తం ఎడపల్లి ఎస్ఎచ్ఓకు అప్పగించినట్లు తెలిపారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నగరంలోని వన్ టౌన్ పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్ పెక్టర్ అంజయ్య తెలిపారు. నగరంలోని కొజ్జా కాలనీలో బొలెరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో 75క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ బియ్యం విలువ సుమారు. రూ.2.45లక్షలు ఉంటుందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తంవన్‌టౌన్ ఎస్ఎచ్ఓకుఅప్పగించినట్లు తెలిపారు.

## జాతీయ సేవా పథకంపై అవగాహన



బతుకమ్మ : నాగిరెడ్డిపేట : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం వేసవికాలం ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం మండలంలోని పోచారం గ్రామంలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న 120 మంది విద్యార్థినీలు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ప్రభాకర్ చారి,మాజీ సర్పంచ్ విజిత శ్రీనివాస్ రెడ్డి,ఏవో సాయికిరణ్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ అనిల్ రెడ్డిలు పాల్గొన్నారు.ఈ జాతీయ పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా రాబోయే ఏడు రోజులు మొక్కలు నాటే కార్యక్రమం, ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన, స్వచ్ఛతహిసేవ, వయ్యారిభామ కలుపు మొక్కల నిర్మూలనపై సామూహిక అవగాహన కార్యక్రమం, క్షేత్ర సందర్శన, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు.